www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 30 | సెప్టెంబర్ | 2026
పేజీలు : 8

## చిత్తడి, అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు




- ఆక్రమణలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ అంకిత్

2 లో

# ఆధారాలున్నా చర్యలేవి..?




-విచారణతో సరిపెడతారా
-సదరం సాక్షిగా కోట్ల వసూళ్లు
-తప్పుడు ధృవీకరణ చేసిన వైద్యుల సంగతేంటి...?





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆరోపణలు వచ్చినప్పుడు ఆధారాలు దొరకగానే చర్యలు తీసుకోవడం ఆనవాయితీ. కానీ గత కొంత కాలంగా కొందరు ఆధారాలనే మాయం చేసి తప్పించుకు తిరుగుతున్నారు. ఖమ్మం పెద్దాసుపత్రి కేంద్రంగా సదరం క్యాంపుల్లో నకిలీ ధృవీకరణకు సంబంధించి ఆధారాలు ఉన్న చర్యలు తీసుకోవడంలో ఎందుకో మౌనం వహిస్తున్నారు. విచారణ పేరుతో సాగుతున్న ఈ తంతు కొందరు వైద్యులను మరికొందరు ప్రైవేటు వ్యక్తులను రక్షించేందుకేనన్న ప్రచారం మిగతా 2లో..

## మాటలతో కాదు.. అగ్రిమెంట్లతో సమాధానం



**24 డిమాండ్ల సాధన నుంచి సింగరేణి పరిరక్షణ వరకు ఏఐటీయూసీ పోరాట పంథా**
**- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్**

**ప్రజాపక్షం/మంచుపల్లి:** సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం లేబర్ కమీషనర్ సమక్షంలో కుదిరిన ఒప్పందాన్ని 'ఫేక్' అని ప్రచారం చేస్తున్న వారు కార్మిక నాయకులు ఎలా అవుతారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార ప్రశ్నించారు. మంగళవారం శేషగిరి భవన్‌లో కొత్తగూడెం, కార్పోరేట్ ఏరియాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి, సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ఒక్కరోజు సమ్మె చేయకుండానే 24 డిమాండ్లపై లేబర్ కమీషనర్ సమక్షంలో ఒప్పందాలు సాధించామని తెలిపారు. కార్మికుల సమస్యలపై ఒప్పందాలు సాధించినందుకు హర్షించాల్సింది పోయి దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. టీబీజీకేఎస్ 11 ఏళ్ల కాలంలో చేసుకున్న ఒప్పంద పత్రాలు, ఏఐటీయూసీ రెండేళ్లలో సాధించిన ఒప్పంద పత్రాలను తీసుకుని సింగరేణిలో మిగతా 2లో..

## వివక్షతకు గురవుతున్న రైతు, కూలీలు




-దేశ సంపదను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్న మోడీ
-ఏఐకెఎంఎస్ మహాసభలో మనో రంజన్ మహంతి

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశంలో రైతులు, కూలీలు వివక్షతకు గురవుతున్నారని వీరికి అధికారంలో భాగస్వామ్యం లభించినప్పుడే మార్పు వస్తుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రో॥ మనోరంజన్ మహంతి తెలిపారు. దేశంలో ఆహారంతో సహా ఉత్పత్తికి కారకులైన రైతులు, కూలీల అవసరాలను తీర్చడంతో పాటు హక్కులను అమలు చేయడంలోనూ పాలకులు నిర్లక్ష్య, కక్షపూరిత వైఖరిని అవలంభిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఏఐకెఎంఎస్ జాతీయ మహాసభలు మంగళవారం అజ్మీర్ సింగ్ హాల్ (ఎస్ఆర్ కన్వెన్షన్)లో ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచికంగా ఏఐకెఎంఎస్ పతాకాన్ని వేములపల్లి వెంకట్రామయ్య ఆవిష్కరించారు. ఆహ్వాన సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎఫ్ గోపీనాథ్, తాళ్లూరి వేణు ప్రతినిధులకు స్వాగతం పలికారు. వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షతన ప్రారంభమైన మహాసభల్లో ప్రో॥ మనోరంజన్ మహంతి మాట్లాడుతూ సామాజిక అణిచివేత, కనీస సౌకర్యాల కొరతతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంకా పేదరికంలోనే జీవిస్తున్నారని ఆయన తెలిపారు. హక్కుల కోసం కాకుండా అధికారం కోసం పోరాటం జరిగినప్పుడే సరైన పరిష్కారం లభిస్తుందన్నారు. అధికారం అంటే నిర్ణయాల్లో భాగస్వామ్యం కాకుండా ఉత్పాదక ఆస్తులను పొందడం, రాజకీయ సామాజిక, ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చుకోవడం మిగతా 2లో..

# ఆధారాలున్నా చర్యలేవి..?

**(మొదటిపేజీ తరువాయి)** జరుగుతుంది. ఎటువంటి వైకల్యం లేని వ్యక్తికి 45 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం క్యాంపులో వైద్యులు ధృవీకరిస్తే దీనిపై చర్యలు తీసుకునేందుకు జంకేందుకన్న ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. ఖమ్మం సదరం క్యాంపుల సాక్షిగా కోట్ల రూపాయల వసూళ్లు జరిగాయి. కొందరు బాధితులు తమ వద్ద నగదు తీసుకుని సదరం సర్టిఫికెట్ ఇవ్వలేదంటూ స్వయనా కలెక్టర్‌కే ఫిర్యాదు చేసిన నేపథ్యంలోనూ చర్యలు లేకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం సదరం క్యాంపుల ద్వారా అర్హులైన దివ్యాంగులను గుర్తించి ధృవీకరణ పత్రాలను అందజేస్తుంది. ధృవీకరణ పత్రాలు చూపి దివ్యాంగులుగా గుర్తించబడి పింఛన్ పొందాల్సి ఉంది. కానీ కొందరు ఎటువంటి వైకల్యం లేకుండానే 40 నుంచి 60 శాతం అంగ వైకల్యం ఉన్నట్లుగా ధృవీకరణ పొంది పింఛన్ పొందుతున్నారు. గతంలో తల్లాడ మండలంలో ఇటువంటి పింఛన్ పొందుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఏమి జరిగిందో కానీ ఇందుకు సంబంధించిన విచారణ నిలిచిపోయింది. ఇప్పటి ప్రభుత్వం మరోసారి దివ్యాంగుల పింఛన్ మంజూరు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించడంతో మళ్లీ నకిలీ ధృవీకరణ వ్యవహారం పుట్టుకొచ్చింది. యథేచ్ఛగా పింఛన్ పొందేందుకు నకిలీలు దరఖాస్తు చేసుకుంటున్నారు.

### సదరం క్యాంపుల్లోనే అంతా...

దివ్యాంగుల ధృవీకరణకు సంబంధించి అంతా సదరం క్యాంపుల్లోనే జరిగింది. కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్కడ తిష్టవేసి పెద్ద మొత్తంలో వసూళ్లు చేసి సదరం క్యాంపుల్లో ఉన్న వైద్యులచేత తప్పుడు ధృవీకరణలతో ధృవపత్రాలను ఇప్పించారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని వేల మందికి ఇటువంటి ధృవీకరణలు ఇవ్వడం జరిగింది. హెవీ లైసెన్సులు ఉన్న డ్రైవర్లు, హమాలీలు, ఎటువంటి అంగ వైకల్యం లేని సంపన్నులైన రైతులు ఈ ధృవీకరణలు పొందారు. ఏడాది కాలంగా దీనికి సంబంధించి తీవ్రమైన ఆరోపణలు వస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంది. కనీస చర్యలు తీసుకోకపోవడంతో ఇప్పుడు అదే తంతు కొనసాగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

### నకిలీ దరఖాస్తుదారులపై చర్యలేవి...?

నకిలీ దరఖాస్తుదారులపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఎటువంటి వైకల్యం లేకుండానే 50 శాతం వైకల్యం ఉన్నట్లు ధృవీకరణ పత్రాన్ని చూపి పింఛన్ పొందెందుకు ప్రయత్నం చేశారు కొందరు. వారికి ఎటువంటి వైకల్యం లేదని తెలిసిన తర్వాత క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం ఆవైపుగా ఆలోచనలు చేయడం లేదు. విచారణ అధికారులు సైతం ఎంతో కొంత పుచ్చుకుని వారిని అర్హులుగా ప్రకటిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. బోనకల్ మండలంలో పింఛన్ దరఖాస్తుల పరిశీలనకు వెళ్లిన ఓ అధికారిణి ఇటువంటి సిఫారసులు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. స్థానికులతో మిలాఖత్ అయి కనీస అర్హత లేని కొందరిని పింఛన్ కోసం సిఫారసు చేశారని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

### వసూళ్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు :

సదరం క్యాంపుల్లో వసూళ్లు చేసిన నగదుకు సంబంధించి సోమవారం సత్తుపల్లి ప్రాంతానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ధృవీకరణ పత్రం అందిస్తామని తమ వద్ద రూ. 30వేల చొప్పున తీసుకున్నారని ఎటువంటి ధృవీకరణ పత్రం అందజేయలేదని వికలాంగులు పేర్కొన్నారు. తమకు తమ డబ్బులను తిరిగి ఇప్పించడంతో పాటు న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను వేడుకున్నారు. దీనిపై విచారణ జరుగుతున్నట్లు అధికారులు బాధితులకు తెలిపారు.

### వైద్యులపై చర్యలేవి...?

ఖమ్మం సదరం క్యాంపులో బాధ్యతల్లో ఉన్న వైద్యులు ఎటువంటి వైకల్యం లేని వారికి వైకల్యం ఉన్నట్లుగా ధృవీకరిస్తూ ధృవపత్రాలను అందజేశారు. ఇప్పటికే అనేక మంది ఇటువంటి తప్పుడు ధృవీకరణలతో పింఛన్ పొందుతుండగా మరి కొందరు పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. తప్పుడు ధృవీకరణ చేసిన వైద్యులపై కనీస విచారణ చేయకుండా ఉన్నతాధికారులు సాగదీత వైఖరిని అవలంభిస్తున్నారు. కేవలం అవినీతి అధికారులను రక్షించేందుకే కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కోట్లు చేతులు మారినా సదరం క్యాంపులకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఇందుకు కారకులైన వైద్యులతో పాటు ప్రైవేటు వ్యక్తులపై సైతం విచారణ జరిపి తగు రీతిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చిత్తడి, అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** చిత్తడి భూముల సరిహద్దుల నిర్ధారణ అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓడిసిఓ కార్యాలయ సమావేశ మందిరంలో చిత్తిడి నేలల సరిహద్దుల నిర్ధారణ అటవీ భూముల పరిరక్షణ ఆక్రమణల నియంత్రణ అటవీ భూముల మళ్లింపు ఆర్ఓఎఫ్ఆర్ సంబంధిత శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐటిడిఏ పిఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి వెంకట గోపాల్ భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలల సరిహద్దుల నిర్ధారణలో కేవలం ఆన్‌లైన్ రికార్డులు కేఎంఎల్ మ్యాపింగ్‌కు మాత్రమే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో భౌతికంగా పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ నీటిపారుదల వ్యవసాయ అటవీ అధికారులు సమన్వయంతో సర్వేచేపట్టి సరిపోల్చి పరిశీలించాలన్నారు. చిత్తడి నేలల పరిధిలో ప్రభుత్వ నీటిపారుదల శాఖ భూములు ప్రైవేటు భూములు ఆక్రమణలకు సంబంధించిన అంశాలను స్పష్టంగా గుర్తించి ప్రత్యేక నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖల రికార్డుల్లో ఉన్న వివరాలను పరస్పరం సమన్వయం చేసుకుని భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా పూర్తిస్థాయి డాక్యుమెంటేషన్ నిర్వహించాలని సూచించారు. అటవీభూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రతీశాఖ తన పరిధిలో చేపడుతున్న పనులపై నెలవారీ పురోగతి విరాలను సిద్ధంచేసుకుని సమీక్షకు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్‌పి సిఇఓ నాగలక్ష్మి, భద్రాచలం ఎఫ్‌డిఓ నిషా కొత్తగూడెం ఆర్డిఓ మధు తహశిల్దార్లు అటవీ రెవెన్యూ నీటిపారుదల పోలీస్ విద్యుత్ ఆర్అండ్‌బి ఐటిడిఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు చీడపీడల నివారణపై శిక్షణ



**ప్రజాపక్షం/కూసుమంచి:** కపాస్ కిసాన్ పథకంలో భాగంగా తురకగూడెంలో పత్తి రైతులకు చీడపీడలు, తెగుళ్ల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూసుమంచి ఏడీఏ రాజేష్ ఆధ్వర్యంలో కేవీకే వైరా శాస్త్రవేత్త డాక్టర్ పావని రైతులకు సమగ్ర సస్యరక్షణ, తెగుళ్ల గుర్తింపు, నివారణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. పంటలో సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించాలని, సిఫారసు చేసిన పురుగుమందులనే తగిన జాగ్రత్తలతో వినియోగించాలని సూచించారు. అనంతరం పత్తి పంటలను పరిశీలించి సబ్సిడీపై మొక్క పెరుగుదల నియంత్రకాలను రైతులకు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బుర్ర కృష్ణ, మండల వ్యవసాయాధికారి రామడుగు వాణి, ఏఈఓ జానీ, రైతులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోండి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో పట్టబద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని అర్హులైన ప్రతి పట్టబద్రుడు తమ పేరును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్‌జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. 2027 మార్చిలో జరగనున్న మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్, వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టబద్రుల నియోజక వర్గాల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ఓటర్ల నమోదు షెడ్యూల్ విడుదల చేసిందని ఆయన తెలిపారు. నవంబర్ ఆరవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఈ ఏడాది నవంబర్ ఒకటి నాటికి డిగ్రీ పూర్తయి మూడేళ్లు నిండిన పట్టబద్రులందరూ ఓటు హక్కు నమోదుకు అర్హులని తెలిపారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం నిబంధనల ప్రకారం మరోసారి ఫారం 8 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను నేరుగా సంబంధిత కార్యాలయాల్లో అందించడంతో పాటు సిఈవో తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. యువత, ఉద్యోగులు, విద్యావంతులు బాధ్యతగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో, పట్టణాల్లో పట్టబద్రుల ఓటర్ల నమోదుకు సంబంధించి విస్తృతంగా ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని ఆయన కోరారు.

# వివక్షతకు గురవుతున్న రైతు, కూలీలు

**(మొదటిపేజీ తరువాయి)**

కొరకు సంఘటితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం భూమి, నదులు, గనులు, అడవులు ఆత్మ నిర్బర్ పేరుతో కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని దుయ్యబట్టారు. రైతులు లబ్ధిదారులు కాదని హక్కుదారులు అని మహంతి తెలిపారు. మోడీ ప్రభుత్వాన్ని మెడలు వంచిన రైతాంగ ఉద్యమం ఇప్పటి కాక్రోచ్, జంతర్ మంతర్ పోరాటం మాదిరి దేశ వ్యాప్తంగా బలమైన రైతాంగ పోరాటం రూపుదిద్దుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా రైతులను, కూలీలను ఐక్యపరిచి నాయకత్వం వహించే దిశగా ఏఐకెఎంఎస్ మహాసభల నిర్ణయాలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తమిళనాడుకు చెందిన పిజంట్ లేబరేషన్ ఫ్రంట్ నాయకులు సెల్వరాజ్, ఉత్తరప్రదేశ్ రైతు నాయకులు ప్రవీణ్‌కుమార్, ఏఐకెఎంఎస్ నాయకులు కెచ్చల రంగయ్య, అశిష్ మిట్టల్, నిర్బయ్ సింగ్, జేవి చలపతిరావు, బాలచంద్ర షడంగి, సుశాంత్ జా, రవీందర్ సింగ్ బాటియా, గాదె దివాకర్, భిక్షపతి, మహేష్ తదితరులు పాల్గొనగా 16 రాష్ట్రాల నుండి మహాసభలకు 450 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభల్లో అరుణోదయ కార్యకర్తలు అలపించిన గేయాలు ఆలోచింపజేశాయి.

# మాటలతో కాదు.. అగ్రిమెంట్లతో సమాధానం

**(మొదటిపేజీ తరువాయి)**

ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. సింగరేణి భవిష్యత్తు కొత్త గనుల ప్రారంభంపైనే ఆధారపడి ఉందని, అందువల్ల శ్రావణపల్లి, సత్తుపల్లి, కోయగూడెం ఓపెన్‌కాస్ట్ కొత్త బ్లాకులను టెండర్ ప్రక్రియ ద్వారా సింగరేణికి కేటాయించాలని కోరారు. సింగరేణి ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను ఏఐటీయూసీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. లేబర్ కోడ్‌లతో సంబంధం లేకుండా గత విధానంలోనే వేజ్‌బోర్డు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీపావళి బోనస్‌ను పెంచడంతోపాటు దసరా పండుగకు ముందే కార్మికులకు లాభాల్లో 40 శాతం వాటా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, కత్తెర్ల రాములు, సమాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బేరర్ల సందబోయిన శ్రీనివాస్, హుమాయున్, నాగయ్య, నితిన్, పిట్ కార్యదర్శులు మధుకృష్ణ, కమల్, అనంతలక్ష్మి , నరేష్, రమేష్, మల్లికార్జున్, సత్తుపల్లి మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి ఎల్.సుశీల్‌కుమార్, నాయకులు బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, సురేందర్, మురళి, సోమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ మహిళ సమస్యను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** దివ్యాగ మహిళ సమస్యను అర్హతమేరకు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యలయ ఆవరణలో ఉన్న దివ్యాంగ మహిళను స్వయంగా కలిసి ఆమె వినతి పత్రాన్ని నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కేసును పరిశీలించి అర్హత మేరకు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనం ఆమెకు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఏఓ భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీయూసీఐలో 12మంది వ్యాగన్ కార్మికుల చేరిక

**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం, విశాఖపట్నం డివిజన్‌లో పని చేస్తున్న 12 మంది రైల్వే వ్యాగన్ కాంట్రాక్ట్ కార్మికులు టీయూసీఐలో చేరారు. ఈసందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కార్మిక చట్టాల ప్రకారం హక్కులు కల్పించడంలో విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విఫలమైందని ఆరోపించారు. కార్మికుల వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులపై శ్రమ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీయూసీఐ కారేపల్లి, కామేపల్లి ఏరియా కార్యదర్శి ధారావత్ సక్రు, నాయకులు వీరు, రమేష్, కృష్ణ, వెంకన్న, బావాసింగ్, సురేష్, నాగేశ్వరరావు, కిరణ్, రాజేష్, భద్రయ్య, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# పొదెంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో బిఆర్ఎస్ పార్టీకి ఎదురొడ్డి పార్టీని బలోపేతం చేసిన మాజీ ఎంఎల్ఏ పొదెం వీరయ్య బిఆర్ఎస్‌లోకి వెళ్తున్నారనే సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు కొందరు దుష్ట చేస్తున్న కుట్ర అని కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ అన్నారు. మంగళవారం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పొదెం వీరయ్య అని అన్నారు. ఆయన పై వస్తున్న ఆరోపణలను పార్టీ శ్రేణులు నమ్మకూడదని, తీవ్రంగా ఖండించాలని సూచించారు. పొదెం వీరయ్య పార్టీ మారుతున్నారని వదంతులు కేవలం రాజకీయ దుర్బుద్ధితో, ప్రత్యర్థులు కావాలని సృష్టిస్తున్న అసత్య ప్రచారాలుగా కొట్టిపారేశారు. భద్రాచలం గడ్డపై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన పొదెం వీరయ్యను ఢీకొట్టలేక చేస్తున్న అసత్య ప్రచారాలని మండిపడ్డారు. ప్రజల సంక్షేమం పట్ల ఆయన ఎప్పుడూ అంకిత భావంతో పనిచేశారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం పని చేస్తున్న పొదెం పై వస్తున్న అసత్య ప్రచారాలని పార్టీ శ్రేణులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఇకనైనా ఆయనపై చేస్తున్న పసలేని ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు.

# డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రయాణికుల సౌకర్యార్థం భద్రాచలం ఖమ్మం మార్గాల్లో నడిచే డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను నేటి నుండి అమలు చేస్తున్నట్లు డిపో మేనేజర్ జంగయ్య మంగళవారం తెలిపారు. భద్రాచలం ఖమ్మం రూట్‌లో డీలక్స్ బస్సు ఛార్జీ రూ.180 ఉండగా, ఇప్పుడు దానిని రూ.170కి కుదించినట్లు చెప్పారు. రూట్ మొత్తం అన్ని రూట్లలో ఇదే రకమైన ధరలు ఉంటాయని ఈ మార్పును ప్రయాణికులు గమనించి డీలక్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహాలక్ష్మీ పథకం ఈ బస్సులకు వర్తించదని తెలిపారు.

# భక్త రామదాసు నీళ్ల కోసం రైతుల ఎదురుచూపు..!



**- రైతులే స్వయంగా కాలువ తీసుకున్న వైనం**
**- 100ఎకరాల ఆయకట్టు**
**సాగునీటికి నోచుకోక వర్షాలపైనే ఆధారం**
**- తిమ్మక్కపేట చెరువుకు నీళ్లు ఎప్పుడంటూ ప్రశ్నిస్తున్న అన్నదాతలు**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుతున్న ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. మండలంలోని తిమ్మక్కపేట చెరువుకు భక్త రామదాసు కాలువ నీళ్ల అందకపోవడంతో 100ఎకరాల ఆయకట్టు రైతులు సాగునీటికై అష్టకష్టాలు పడుతున్నారు. చెరువుకు నీరు చేరితే తమ పంటలకు సాగునీటి భరోసా ఉంటుందని రైతులు చెబుతున్నారు. రైతులే కాలువ తీసుకున్న దుస్థితి కాలువ ద్వారా నీరు రావాల్సి ఉన్నప్పటికీ సరైన నీటి ప్రవాహం లేకపోవడంతో రైతులే స్వయంగా కాలువను తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. పంటలను కాపాడుకునేందుకు తమ సొంత శ్రమతో కాలువ పనులు చేపడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉండగా రైతులే కాలువలు తీసుకోవాల్సిన పరిస్థితి రావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**- వర్షాలపైనే ఆధారం...**

తిమ్మక్కపేట చెరువు కింద సుమారు 100ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ సాగునీటి సౌకర్యం అందుబాటులో లేక రైతులు వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. వర్షాలు సకాలంలో కురిస్తేనే పంటలకు నీరు అందే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**- మంత్రి దృష్టికి తీసుకెళ్లినా...**

తిమ్మక్కపేట చెరువుకు భక్తరామదాసు నీటిని అందించాలని రైతులు మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ సంబంధిత ఇరిగేషన్ అధికారుల సమస్యను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. భక్త రామదాసు కాలువ నుంచి తిమ్మక్కపేట చెరువుకు నీరు చేరేలా చర్యలు తీసుకుని 100ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని వారు కోరుతున్నారు. తిమ్మక్కపేట చెరువుకి భక్త రామదాసు కాలువ ద్వారా అందించే శాశ్వత కాలువ నిర్మాణానికి తాళ్లచెరువు రైతు పట్టా భూమి ఉండటంతో అతను కోర్టును ఆశ్రయించాడు కాలువ తీయకుండా పెండింగ్ ఉండటం ద్వారా తిమ్మక్కపేట చెరువుకి శాశ్వత కాలువ లేక నీరు అందించలేకపోతున్నామని ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు.

**- నీళ్లు అందించండి మహా ప్రభో.!**

భక్త రామదాసు నీళ్లు మా చెరువుకు అందితే మా పంటలకు సాగునీటి భరోసా ఉంటుంది. రైతులే కాలువలు తీసుకునే పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. తిమ్మక్కపేట చెరువుకు భక్త రామదాసు నీళ్లు ఎప్పుడు అందిస్తారో చెప్పాలి అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# తడి.. పొడి.. మొక్కుబడి..!

**నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు**





**ప్రజాపక్షం/చింతకాని :** పల్లెలు స్వచ్ఛంగా మారాలని, తడిపొడి చెత్త నిర్వహణ ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరాలని ప్రభుత్వం ఆశించింది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

**లక్ష్యం గొప్పదే..**

పల్లెల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు గత ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ట్రాక్టర్లలో చెత్తను సేకరించి, తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయడం, పొడి వ్యర్థాలను విక్రయించి పంచాయతీలకు ఆదాయం తేవడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం . ఇందుకోసం జిల్లాలోని 26 మండలాల్లో ఉన్న 589 గ్రామ పంచాయతీల్లో ఒక్కో షెడ్డుకు రూ.2.50 లక్షల చొప్పున కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. అయితే ఎరువు తయారీకి అవసరమైన వానపాములను వేయకపోవడం , పొడి చెత్తను అరల్లో వేరు చేయకపోవడంతో ఈ ఆశయం నీరుగారిపోయింది.

**విఫలానికి కారణాలివే..**

సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణపై అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడమే ప్రధాన లోపంగా మారింది. ఎరువుల తయారీకి అనువుగా నిర్మాణాలు లేకపోవడం, గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో నిర్మానుష్య ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం మరో సమస్యగా మారింది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో సేకరించిన చెత్తను అక్కడికే తీసుకెళ్లి తగులబెడుతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా అధికారులు స్పందించి లోపాలను సరిదిద్ది , ఎరువుల తయారీ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా త్వరలోనే వీటిని వినియోగంలోకి తెచ్చి ఎరువుల తయారీ ద్వారా గ్రామపంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బస్సు,లారీ ఢీ

**-తప్పిన పెను ప్రమాదం..డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**
**-ప్రయాణికులకు స్వల్ప గాయాలు**
**-అరగంటపాటు బస్సులోనే డ్రైవర్**







**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సోమవారం గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ వద్ద మంగళవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల ప్రకారం...ఎన్ఎల్01బి4255 నెంబర్ గల షామోలి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు వెళుతుండగా సోమవరం గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ వద్ద లారీని ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి బస్సు ముందు భాగంగా తీవ్రంగా దెబ్బతినగా, డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. సుమారు అరగంటపాటు డ్రైవర్ బస్సులోనే చిక్కుకుపోవడంతో ప్రయాణికులు, అటుగా వెళుతున్న వాహనదారులు సహాయ చర్య చేపట్టి అతడిని బయటకు తీశారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. ఘటనతో కొద్దిసేపు హైవేపై ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

# జాతీయస్థాయికి అశ్వాపురం గిరిజన క్రీడాకారిణి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం గ్రామానికి చెందిన గిరిజన క్రీడాకారిణి కే నవ్య క్రీడల్లో సత్తాచాటింది. అండర్ 16 బాలికల జావెలిన్‌త్రోలో సిల్వర్ మెడల్ సాధించిన ఆమె, త్రోబాల్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. నవ్య విజయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను కన్నెదారి వరప్రసాద్ అభినందిస్తూ జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. సారపాకకు చెందిన కోచ్ గిరి ప్రసాద్ శిక్షణలో నవ్య ఈ విజయాలు సాధించింది. జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి అశ్వాపురం, జిల్లాకు పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

# పింఛన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** మండల ఎంపీడీవో అశోక్ బెండాలపాడు గ్రామ పంచాయితీలో పర్యటించి కొత్తగా ప్రకటించిన చేయూత పింఛన్ పథకానికి దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి వివరాలు పరిశీలించారు. నిబంధనల ప్రకారం అర్హత సాధించిన వారికి పింఛనఖ మంజూరవుతుందని తెలిపారు. అనంతరం ప్రమాదంలో కాలికి గాయమై చికిత్స పొందుతున్న బెండాలపాడు సర్పంచ్ బొర్రా లలితను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఉపాధి హామీ పథకం కింద చెల్లించాల్సిన రూ 28,200 పనుల వివరాలతో గ్రామ పంచాయితీ ఏర్పాటు చేసిన సమాచార బోర్డును కూడా ఎంపీడీవో పరిశీలించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రోహిత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, ఉప సర్పంచ్ బానోత్ బాలు, పింఛన్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు అవకాశం



**ప్రజాపక్షం/కారేపల్లి:** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ లేదా సమాన విద్యార్హత కలిగి ఉన్న అర్హులు ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి తహసీల్దార్ ఒరుగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. గత పట్టభద్రుల జాబితాలో పేరున్న వారు కూడా కొత్తగా ఫారం 18 సమర్పించుకోవచ్చని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

# కారేపల్లిలో మనీషా లక్ష్మీ పర్యటన



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి గ్రామంలో బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బాణోత్ మనీషా లక్ష్మీ మదన్‌లాల్ పర్యటించారు. బీఆర్ఎస్ నాయకుడు చింతల సంపత్ తండ్రి, ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన చింతల హనుమంతు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల మృతి చెందిన పాలిశ కొమరమ్మ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం





**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. 60 మమంది స్వచ్ఛంద దాతలు రక్తదానం చేశారు. రక్తదాతల సేవలను అభినందిస్తూ సత్కరించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కూసుమంచి వైద్యాధికారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు రక్తదానం చేసి శిబిరానికి సహకరించారు. ఖమ్మం జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ సీఏఎస్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీకాంత్‌తో పాటు బ్లడ్ బ్యాంక్ బృందం, కూసుమంచి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. రక్తదానం ప్రాధాన్యంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే కార్యక్రమాలను కొనసాగిస్తామని పీహెచ్‌సీ అధికారులు తెలిపారు.

# సాగునీటితో పదవుల పందేరమా...?



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించకుండా అధికార పార్టీ పర్యటనలు, ప్రారంభోత్సవాలతో రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రారంభించారని, తుమ్మలచెరువు ఆయకట్టుకే సాగునీరు అందుతోందని ఆరోపించారు. రైతులకు విస్తృతంగా నీరు అందకుండా మరోసారి తూములు దించడంలో ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క ఆయకట్టుకు నీటి విడుదలకే వరుస పర్యటనలు, ప్రారంభోత్సవాలు ఎందుకని నిలదీశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ 25కోట్లతోనే పనులు జరిగాయని, ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా నిధులు కేటాయించలేదని బీఆర్ఎస్ నాయకుడు మర్రి మల్లారెడ్డి ఆరోపించారు. పర్యటనలు, ప్రారంభోత్సవాలు పక్కనపెట్టి మారెళ్లపాడు రైట్ కెనాల్ పనులు వెంటనే ప్రారంభించి అశ్వాపురం మండలంలోని చివరి ఎకరం వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోళ్లు పారదర్శంగా నిర్వహించాలి

**- ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి**
**- నిల్వలపై ముందస్తు ఏర్పాట్లు చేసుకోండి**
**- కలెక్టర్ అంకిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వానా కాలం ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా పారదర్శంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన ధాన్యం కొనుగోళ్ల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సుమారు 1.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఇందు కోసం 190కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2.461, సాధారణ రకానికి రూ.2.441 మద్దతు ధరగా నిర్మయించామని సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో సన్నధాన్యానికి క్వింటాళ్లకు రూ.2961 వరకు లభిస్తుందని పేర్కొన్నారు. అక్టోబర్ 1వ తేది నాటికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వర్షాకాలం నేపథ్యంలో ధాన్యం నిల్వకు గోదాములు, ఫంక్షన్ హాళ్లు తదతరి భవనాలను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలన్నారు. ఏ ఒక్కగింజ కూడా తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు తమ పరిధిలోని ధాన్యం నిల్వ సమార్ధ్యం అంచనా పరిమాణంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, డి వేణుగోపావరావు, పౌర సరఫరాల అధికారులు ప్రైమ్‌కుమార్, త్రినాధ్ బాబు వ్యవసాయాధికారి బాబూరావు ఇతర శాఖల అధికారులు రైస్ మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

**గుండాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ**





**ప్రజాపక్షం/గుండాల:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం గుండాల పోలీస్‌స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, నేర నియంత్రణ చర్యలపై వివరాలు తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసులు నమోదు, దర్యాప్తు పురోగతి, ఇతర వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో నిరంతరం అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు త్వరిత సేవలు అందించాలని సూచించారు. స్టేషన్ కాంపౌండ్ వాల్, గార్డ్‌పోస్ట్ మరమ్మతులు పూర్తి చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ప్రాపర్టీని భద్రపరచాలని ఆదేశించారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుని సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ తెలిపారు. ఈకార్యక్రమంలో గుండాల సీఐ తిరుపతి, ఎస్ఐ శ్రవణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగ పరిరక్షణకు ఐక్య విద్యార్థి ఉద్యమాలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వవిద్యా రంగ పరిక్షణకు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఐఖ్య విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. హన్మకొండలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర నిర్మాణమహాసభల్లో జిల్లా ప్రతినిధి బృందం పాల్గొంది. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌళిక వసతుల కొరత, ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఖాళీలు ఉపకారవేతనాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంక్షేమ హాస్టళ్ల సమస్యసలపై మహాసభల్లో చర్చించినట్లు చెప్పారు. పేద మధ్య తరగతి విద్యార్థులపై ఆర్థిక భారం పెరగకుండా ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వపాఠశాలలు, కళాశాలలు గురుకులాలు హాస్టళ్లలో మౌళిక వసతులు మెరుగుపర్చడంతో పాటు ఖాళీలను భర్తీ చేయాలని పెండింగ్ స్కాలర్‌షిప్‌లు పీజు రీయింబర్స్మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామీణ గిరిజన విద్యార్థుల సమస్యలపై పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు గుండాల సుజన్, మాణిక్యాల వినయ్ శ్యాల ఉమా మహేష్ జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్ నాయకులు జుంజునూరి రాజ్ కమల్ పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

**- జిల్లా పంచాయతీ అధికారి అనూష**



**ప్రజాపక్షం/చుంచుపల్లిః** హైకోర్టు స్టే, స్టేటస్ కో ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగించడంపై జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) అనూష ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ భవన నిర్మాణాలను ఆమె పరిశీలించారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ నిర్మాణ పనులు కొనసాగిస్తే న్యాయపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడెంఖమ్మం ప్రధాన రహదారి పక్కన చిమ్మని రామకృష్ణ చేపడుతున్న భవన నిర్మాణంపై కొండల్, భూక్య హరి గ్రీవెన్స్ ద్వారా డీపీఓకు ఫిర్యాదు చేశారు. సదరు స్థలానికి సంబంధించి హైకోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ స్టే ఉత్వర్వులు అమలులో ఉన్న సమయంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై స్పందించిన డీపీఓ అనూష సంబంధిత నిర్మాణ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించడంతోపాటు, అక్కడ నిల్వ ఉంచిన నిర్మాణ సామాగ్రిని కూడా తొలగించాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణదారులకు సంబంధిత నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారి ఇరువైపులా అనుమతులు లేకుండా చేపడుతున్న ఇతర నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులను కూడా డీపీఓ పరిశీలించారు. పంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టే ముందు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగడంపై పంచాయతీ అధికారులను డీపీఓ వివరణ కోరారు. నిబంధనలను ఉల్లంఘించే నిర్మాణాలపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీపీఓ అనూష వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను మండల కేంద్రంలోని ఆళ్లపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ వాసం సుస్మిత, ఉప సర్పంచ్ సయ్యద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, వార్డుసభ్యులు బూరుగడ్డ కృష్ణ, సెక్రటరీ ఉపేందర్, జిఆర్ఓ చిరంజీవి, మంగపద్మ పాల్గొన్నారు.

# నేడు పంట పొలాలకు గోదావరి జలాలు

**ప్రజాపక్షం/అశ్వాపురం:** మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలచెరువు నుంచి గోదావరి జలాలను పంట పొలాలకు బుధవారం విడుదల చేయనున్నట్లు అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు తెలిపారు. పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు తూము లాకులు ఎత్తి నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సాగు నీరు అందుబాటులోకి రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు.

# గణపతి శోభాయాత్రలో వివాదం

**- ఓ కార్పోరేటర్‌తో సహా పలువురిపై అట్రాసిటి కేసు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు చేపట్టిన వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఇరు వర్గాల మధ్యన చెలరేగిన వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. బాదితుల ఫిర్యాదుతో ఓ కార్పోరేటర్‌తో సహా మరో 10మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పట్టణ పరిధి కయమ్మ కాలనీలో చేపట్టిన వినాయక నిమజ్జన యాత్రలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు వచ్చిన వారికి, మరో వర్గానికి మధ్యన తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలి వానలా మారి తీవ్ర రూపం దాల్చి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని బాదితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన డిఎస్‌పి సతీష్ కుమార్ విచారణ ప్రారంభించారు. దీనితో ప్రశాంతంగా ఉన్న జయమ్మ కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్గాలు సైతం ఫిర్యాదు చేయటానికి తగిన ఆధారాలతో సిద్ధమవుతున్నారని సమాచారం. వివాదానికి దారి తీసిన సంఘటనలపై వివరాలను సేకరించి ఘటనకు కారకులను గుర్తించే పనిలో పోలీస్ శాఖ నిమగ్నమైనది.

# బాధిత కుటుంబానికి బియ్యం వితరణ



**ప్రజాపక్షం/పాల్వంచ :** బాదిత కుటుంబానికి సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వంద కిలోల బయ్యాన్ని మంగళవారం వితరణ చేశారు. మండల పరిధి (ఉల్వనూర్ ) లక్ష్మిదేవిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ గ్రామ శాఖ సభ్యుడు కాలం గురువయ్య (65) కొంత కాలంగా అనారోగ్యం భారిన పడ్డాడు. కుటుంబ సభ్యులు లక్షలు ఖర్చుపెట్టి ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఈ క్రమంలో గత 20 రోజుల క్రితం మృతి చెందాడు. అప్పుల పాలైన కుటుంబానికి సిపిఐ అండగా నిలిచింది. పార్టీ జిల్లా సమితి ఆదేశాలతో మృతుడి కుటుంబానికి 100 కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు, మండల నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, వజ్జా వాసు, చిల్లా క్రిష్ణ, ప్రజా నాట్య మండలి సభ్యులు కే. రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యా సుబ్బయ్యకు నివాళి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలం కొమరారం గ్రామానికి చెందిన విప్లవ సానుభూతిపరుడు బయ్యా సుబ్బయ్య అనారోగ్యంతో సెప్టెంబర్ 28న మృతి చెందారు. ఆయన పార్థివదేహాన్ని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కొమరారం గ్రామ కమిటీ నాయకులు సందర్శించి అశ్రునివాళులర్పించారు. సుబ్బయ్య కుమారుడు బయ్యా వెంకన్న ప్రస్తుతం ప్రగతిశీల యువజన సంఘం నిర్మాణ కార్యక్రమాల్లో కొనసాగుతున్నారని నాయకులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మోతీలాల్, న్యూడెమోక్రసీ ఇల్లందు మండల కమిటీ సభ్యుడు జోగా కృష్ణ, ఏఐకేఎంఎస్ పోచారం కార్యదర్శి, ఉప సర్పంచ్ కోడి పాపారావు, కుంజా కృష్ణ, బొల్లెం లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల తప్పిదానికి పేద కార్మికులే బలి?



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లందు మున్సిపాలిటీ వాటర్‌సప్లై విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడంతో తమ పేర్లు ఎల్3 జాబితాలోకి వెళ్లాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ ఉద్యోగులు కాదని, తక్కువ వేతనాలతో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నామని తెలిపారు. ఏళ్లుగా తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవలు అందిస్తున్న తమ ఉద్యోగ స్వరూపం రికార్డుల్లో స్పష్టంగా ఉన్నప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనలో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపడం అన్యాయమని వారు ఆరోపించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల రికార్డు తప్పిదాన్ని వెంటనే సరి చేసి, నిబంధనల ప్రకారం అర్హులైన వారిని ఎల్ 3 నుంచి ఎల్1లోకి తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# బడ్డీ దుకాణాల్లో విచ్చలవిడిగా పొగాకు విక్రయాలు



**-బెల్ట్ షాపుల ముసుగులో పాన్‌పరాగ్, గుట్కా, ఖైనీ**
**-విద్యా సంస్థల పరిసరాల్లోనూ విక్రయాలు**
**-అధికారుల నిఘా ఎక్కడ....?**



ప్రజాపక్షం/ తల్లాడ : చిన్నబడ్డీ దుకాణం ముందు నుంచి చూస్తే సాధారణంగా కనిపిస్తుంది. కానీ అదే దుకాణంలో యువతను వ్యసనాల వైపు నడిపించే పొగాకు పదార్థాలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. పాన్‌పరాగ్, గుట్కా, ఖైనీ, పొగాకు కలిగిన పాన్‌మసాలా తదితర పదార్థాలు అందుబాటులో ఉండడంతో యువత, విద్యార్థులు వాటికి అలవాటు పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**బెల్ట్ షాపుల తరహాలో విక్రయాలు :**
మద్యం బెల్ట్‌షాపుల మాదిరిగానే కొన్ని చిన్న దుకాణాలు పొగాకు ఉత్పత్తుల విక్రయ కేంద్రాలుగా మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కస్టమర్ అడిగిన వెంటనే చిన్న ప్యాకెట్లలో పదార్థాలను అందిస్తూ వ్యాపారం సాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో యువత రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తుందని అంటున్నారు.

**పాఠశాలలు, కళాశాలల సమీపంలోనూ :**
విద్యా సంస్థల చుట్టు పక్కల పొగాకు ఉత్పత్తుల విక్రయంపై చట్టపరమైన నిషేధం ఉంది. COTPA చట్టంలోని సెక్షన్ 6బి ప్రకారం విద్యా సంస్థల సరిహద్దు నుంచి 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధం. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు విక్రయించడం కూడా నేరమే. అయితే కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాల సమీపంలోని దుకాణాల్లోనే పొగాకు ఉత్పత్తులు లభిస్తున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యార్థులు సులభంగా కొనుగోలు చేసే పరిస్థితి ఉంటే నిఘా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**లాభం కోసం యువత భవిష్యత్తుతో చెలగాటం :**
కొన్ని దుకాణాల యజమానులు యువతలో ఉన్న వ్యసనాన్ని వ్యాపార అవకాశంగా చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తక్కువ ధరలో లభించే చిన్న ప్యాకెట్లే మొదట ఆసక్తిని పెంచి క్రమంగా అలవాటుగా మారే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పొగాకు వినియోగం ధూమపానం రూపం లోనే కాకుండా గుట్కా, ఖైనీ, పొగాకు కలిగిన పాన్‌మసాలా వంటి రూపాల్లోనూ జరుగుతుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంటుంది. గుట్కాపై ప్రత్యేక నిబంధనలు పొగాకు లేదా నికోటిన్‌ను ఆహార పదార్థాల్లో పదార్థాలుగా ఉపయోగించడాన్ని FSSAI నిబంధనలు నిషేధిస్తున్నాయి. ఈ నిబంధనల కారణంగా గుట్కా విక్రయం నిషేధించబడిందని జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం స్పష్టం చేస్తుంది.

**అధికారుల నిఘా పెరగాలి :**
పోలీసులు, ఎక్సైజ్, సంబంధిత అమలు విభాగాలు, ఆహార భద్రత అధికారులు, ఆరోగ్యశాఖ కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల చుట్టూ 100 గజాల పరిధిని పరిశీలించి మైనర్లకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నది తనిఖీ చేయాలని కోరుతున్నారు. దేశవ్యాప్తంగా పొగాకు నియంత్రణ కోసం అమలు బృందాలు, చలాన్లు నమోదవుతున్నాయని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చూపిస్తున్నాయి.

**యువతను కాపాడేది ఎవరు...?**
ఒకవైపు వ్యసనాల నుంచి యువతను దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మరో వైపు వారి కండ్ల ముందే పొగాకు ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉంటే ఆ ప్రయత్నాల ప్రయోజనం ఎంత వరకు అన్న ప్రశ్నలు వస్తున్నాయి. చట్టం ఉన్నంత మాత్రాన సరిపోదు. నిరంతర తనిఖీలు, ఉల్లంఘనలపై చర్యలు, పాఠశాలల పరిసరాల్లో కట్టుదిట్టమైన నిఘా అవసరం అని ప్రజలు కోరుతున్నారు.

# తల్లాడలో మండల స్థాయి సమీక్షా సమావేశం







ప్రజాపక్షం/తల్లాడ : తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాపేట సర్పంచ్ తాళ్ల సుధారాణి మాట్లాడుతూ నర్సింహారావుపేట, గోపాలపేట లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని కోరారు. అడిషనల్ ఏసిడిపివో పద్మావతి, సూపర్‌వైజర్ సందర్శిస్తామని హామీ ఇచ్చారు. కులాంతర వివాహాలు చేసుకున్న దళిత అభ్యర్థులకు స్వయం ఉపాధి కల్పన కోసం రూ.2,50,000 ప్రోత్సాహక నగదు ఆర్థిక సాయం ఉందని, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సాయం చేసే అవకాశం ఉందని ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ సహాయ అధికారి ఎం. వీరన్న వివరించారు. తల్లాడ సర్పంచ్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో మంచి నీటి బోర్ వేయాలని కోరారు. ఏఈ హౌసింగ్ ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి నివేదిక సమర్పించారు. 103 గృహాల నిర్మాణాలు గృహ ప్రవేశాల స్థాయికి తీసుకు రావాలని సర్పంచ్‌లను ఇందిరమ్మ కమిటీ సభ్యులను, పంచాయతీ కార్యదర్శులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రత్యూష, వెటర్నరీ వైద్యులు రాజు, మండల స్థాయి వ్యవసాయ అధికారి తాజుద్దీన్, ఎంపివో హరికృష్ణ, హార్టికల్చర్ అధికారి వినోద, ఇరిగేషన్ ఇంజనీర్ నవ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంత్, ఏపిఎం రవి, ఏపివో కోటయ్య పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరికి ఉపాధి పనులు కల్పించే ప్రణాళికలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రతీ ఒక్కరికి వీబీజీ రాంజీ ద్వారా ఉపాధి పనులు కల్పించనున్నట్లు నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని కొత్తకొత్తూరు లో మంగళవారం వీబీజీ రాంజీ ప్లానింగ్ కార్యక్రమం ను నిర్వహించారు. తొలుత పంచాయతీ మ్యాప్ ను పరిశీలించారు. గ్రామ మ్యాప్ ను రంగుల ముగ్గు ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీబీజీ రాంజీ పథకం ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పని చేసే ప్రతీ ఒక్కరికి పని కల్పించేలా ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ మాలోత్ కళావతీ, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ. ఏపీవో అమ్మాజాన్, పంచాయతీ కార్యదర్శి రవి, వార్డు సభ్యులు ఠాగూర్ రాంసింగ్, జ్యోతిబసు, అయోధ్య, రామయ్య, తదితరులు పాల్గొన్నారు. మండలం లోని రాయగూడెం పంచాయతీలో జరిగిన సభలో సర్పంచ్ బోయిన వేణు, ఉప సర్పంచ్ సూరేపల్లి ప్రేమ్ కుమార్, రాజాబాబు, డేగల వేణు, తీగ హనుమంతు, కోసూరు పానకాలు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యతనిచ్చి వాటిని పరిష్కరించాలని రఘునాథపాలెం మండల ప్రత్యేకాధికారి డా॥ పురందర్ తెలిపారు. మంగళవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై 45 రోజులకు ఒకసారి నిర్వహించే సమీక్షా సమావేశం ఎంపిడివో అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ పురందర్, ఎంపిడివో అశోక్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని తెలిపారు. సమస్యలను గుర్తించడంతో పాటు వాటిని పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు తమ పంచాయతీల పరిధిలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పలు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మరి కొన్ని సమస్యలను జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. గత సమావేశంలో సర్పంచులు లేవనెత్తిన తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు వంటి సమస్యలను ఇప్పటికే అధిక శాతం పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎనిమిదవ డివిజన్‌లో గడప గడపకు బిఆర్ఎస్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ ఎల్‌బి నగర్‌లో గడప గడపకు బిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం బిఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ ఆధ్వర్యంలో ఎల్‌బి నగర్ ప్రాంతంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ప్రజలు తెలిపినట్లు అశోక్ తెలిపారు. సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణీకుల సౌకర్యార్థం ఖమ్మం నుంచి భద్రాచలం, ఖమ్మం నుంచి సత్తుపల్లి మార్గాలలో నడిచే డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను నేటి నుంచి అమలు చేయనున్నట్లు ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నుంచి భద్రాచలం డీలక్స్ బస్సుకు ఛార్జీ రూ. 180 ఉండగా ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ ఛార్జీ రూ. 170గా మార్పుబడిందన్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి డీలక్స్ బస్సుకు ఛార్జీ రూ. 130 ఉండగా ఇప్పుడు రూ. 120గా మార్పుబడిందని తెలిపారు. ఇట్టి డీలక్స్ బస్సుల రూటులో మొత్తం అన్ని స్టేజీలలో ఎక్స్‌ప్రెస్ ఛార్జీలే వర్తిస్తాయని డిఎం తెలిపారు. ప్రయాణీకులు ఈ మార్పును గమనించి సంబంధిత డీలక్స్ బస్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

# విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



ప్రజాపక్షం/తల్లాడ : తల్లాడ మండలం బిల్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, షూ, బెల్ట్‌లను మంగళవారం బిల్లుపాడు గ్రామ సర్పంచ్ ఏనిక కృష్ణవేణి, ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా చదువులో ముందుకు రావాలని ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిల్లుపాడు గ్రామ పెద్దలు సామినేని రామప్పరావు పాల్గొన్నారు.

# మట్టా దయానంద్‌ను కలిసిన మండల నాయకులు



ప్రజాపక్షం/తల్లాడ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌ను తల్లాడ మండలంలోని కలకోడిమ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే రామారావు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు తాతా భాస్కర్‌రావు లు మంగళవారం కలిశారు. సత్తుపల్లిలోని ఎంఎల్‌వి క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలపై చర్చించారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, గ్రామంలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

# సిఆర్‌టిల టీచర్లకు బదిలీలు



ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన సంక్షేమశాఖ ఖమ్మం జిల్లా పరిధిలో పనిచేస్తున్న 67 మంది సిఆర్‌టి టీచర్లకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేసినట్లు ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. మంగళవారం ఐటిడిఏ కార్యాలయంలో కమిటీసభ్యుల సమావేశంలో ఈ బదిలీల ప్రక్రియకొనసాగింది. భార్య భర్తలు, వికలాంగులు వైద్యపరిమైన కారణాలు వితంతు మహిళకు ప్రాధాన్యత ఇచ్చారు. తెలుగు 6 ఇంగ్లీష్ 9 లెక్కలు 12 ఫిజిక్స్ 9, బయోసైన్స్ 9 సోషల్ 8 ఎస్‌జిటి 6 పిడి పిఇటి ఎల్‌పిటి ఒక్కొక్కరిని కలిపి మొత్తం 67 మందిని బదిలీ చేశారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించినట్లు పిఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిడి ఫిరంగి, ఏసిఎంఓ రాములు ఏటిడిఓ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.